క్లుప్తంగా

టీడీపీలోకి చేరారంటూ అసత్య ప్రచారం


ఓబయ్య

పోరుమామిళ్ల : రామాయపల్లెలో ఆదివారం 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరాయని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన బూత్ కన్వీనర్ ఓబయ్య తెలిపారు. స్థానికంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఒక్కరూ వెళ్లలేదన్నారు. ఆ పార్టీ వాళ్లనే చేర్చుకుని వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చినట్లు చెప్పుకోవడం తగదన్నారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఎమ్మెల్సీ రామచంద్రయ్య సమక్షంలో వంద కుటుంబాలు చేరాయని వచ్చిన వార్తలపై ఓబయ్య తీవ్రస్థాయిలో మండి పడ్డారు. రామాయపల్లె ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీ నుంచి ఒక్కరూ చేరలేదని, అలా చేరి ఉంటే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. తప్పుడు ప్రచారాలు టీడీపీకి మొదటి నుంచి అలవాటేనన్నారు. ఓటమి భయంతో అంత మంది చేరారు.. ఇంత మంది చేరారంటూ ప్రచారం చేసుకోవడం వారికి అలవాటన్నారు. పబ్లిసిటీ కోసం ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు.

కల్యాణ వైభోగమే..


భక్తులకు మాంగల్య దర్శనం చేయిస్తున్న అర్చకుడు

కడప కల్చరల్ : విజయదుర్గాదేవి ఆలయంలో సోమవారం శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. అమ్మవారు కడప నగరంలో కొలువుదీరిన రోజును పురస్కరించుకుని ఉదయం అమ్మవారి మూల విరాట్ కు 25 కలశాలలోని పవిత్ర జలాలతో విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. యాగశాలలో చండీహోమం, ఆలయ మండపంలో నవావరణ శ్రీ చక్రార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ మల్లికార్జునస్వామి, విజయదుర్గమ్మల ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్, కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో అర్చక బృందం కల్యాణ క్రతువును నిర్వహించింది. టీటీడీ కళాకారులు అమ్మవారి భక్తిగీతాలు ఆలపించారు. కల్యాణం అనంతరం రాత్రి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నగర వీధుల్లో పూల రథంపై స్వామి, అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. విచిత్ర వేషధారణలు, బాణాసంచా వెలుగులు ఈ ఉత్సవంలో ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న దాతలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లో అంతర్జాతీయ షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారుడు దేవేంద్రకు రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. దాతలు మనోహర్‌రెడ్డి, సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, నేత్రవైద్య నిపుణుడు డాక్టర్ స్వరూప్ కుమార్‌రెడ్డి, జార్జి కారొనేషన్ క్లబ్, సోషల్ అసిస్టెంట్ సావిత్రి కలసి రూ.30 వేలు ఇచ్చారు. అంతర్జాతీయ పోటీల్లో దేవేంద్ర ప్రతిభ చాటాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, క్లబ్ సెక్రటరీ గంగిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజసింహ, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ సెక్రటరీకి సన్మానం


సుజనేంద్రను సన్మానిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

బ్రహ్మంగారిమఠం : ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగ సంఘం బద్వేల్ డివిజన్ జాయింట్ సెక్రటరీగా బి.మఠం ఎంపీడీఓ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ బొల్లు సుజనేంద్ర నియమితులయ్యారు. ఆయనను బి.మఠం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఈఓ పీఆర్డీ జాన్‌కెనడా, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, సోమిరెడ్డిపల్లె పంచాయతీ గ్రామ సచివాలయాల కన్వీనర్ జోగయ్య, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం

కడప ఎడ్యుకేషన్: కడప మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ఇందిరానగర్‌లో సోమవారం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ప్రైమ్ ఆసుపత్రి ఎండీ సర్ఫరాజ్ అలీఖాన్ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందచేశారు.

తాగునీరు ఇవ్వలేకపోయిన టీడీపీ



● ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : టీడీపీ 14 ఏళ్ల అధికారంలో ఉన్నా, వారు నిలబెట్టిన మున్సిపల్ చైర్మన్లు పరిపాలన చేసినా ప్రొద్దుటూరు ప్రజలకు తాగడానికి గుక్కెడు నీళ్లు ఇవ్వలేకపోయారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, 11వ వార్డు ఇన్‌చార్జి కసిరెడ్డి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి, 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10, 11వ వార్డుల్లో రూ.కోటితో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.25 కోట్లతో సంక్షేమ పథకాలు మంజూరు చేశామన్నారు. ఒక్క మారు తమకు అధికారం ఇవ్వడంతోనే రూ.150 కోట్లతో తాగునీటి పథకాన్ని పూర్తి చేసి ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చామన్నారు. 17 ట్యాంకుల ద్వారా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామన్నారు. మున్సిపాలిటీలో పార్కులను అభివృద్ధి చేశామన్నారు. రూ.110 కోట్లతో రోడ్లు, డ్రైనేజి కాలువలను నిర్మించామన్నారు. పెన్నానదిపై బ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్, వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీ, కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. 24 వేల ఇళ్ల పట్టాలను పేదలకు ఇచ్చామని తెలిపారు. ఈ కారణంగానే అడుగడుగునా ప్రజలకు ఎన్నికల ప్రచారంలో అపూర్వ స్పందన కనిపిస్తోందన్నారు. గతంలో ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజల వద్దకు వెళ్లాలంటే నాయకులు ఇబ్బంది పడే పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇప్పుడు ఆ సమస్య లేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను, అభివృద్ధిని అందించామన్నారు. మన బడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు సేవలు అందిస్తున్నామన్నారు. 2012లో జరిగిన పంట నష్టం డబ్బును టీడీపీ నేతలు తెచ్చుకోలేకపోయారని, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మంజూరు చేయించారన్నారు. గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నామని, రూ.25 లక్షల విలువ గల ఆరోగ్యశ్రీ కార్డును ఇస్తున్నామన్నారు. ఓటు అడిగే హక్కు టీడీపీ నేతలకు ఏ మాత్రం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్ మిల్లు ఖాజా, రాచమల్లు రాఘవేంద్రారెడ్డి, వార్డు నాయకులు కసిరెడ్డి వినోద్‌రెడ్డి, గరిశపాటి వంశీధర్, రఘు, వెంకట్, వంకం ప్రసాద్, రమణ, మధు, సందీప్, చవ్వా శ్రీనివాసులరెడ్డి, నాగేంద్రబాబు, శారద, మార్కెట్ వేణు, లలిత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, సత్యం, పిట్టా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధిని చెప్పుకుంటే లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తాం

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పాటు ఇచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తే మనం లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక గోల్డెన్ పార్కులో సోమవారం కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ప్రభుత్వంలో గడపగడపకు అభివృద్ధి జరిగిందని అన్నారు. ఈ కారణంగానే మంచి చేసిన వారికే ఓట్లు వేయాలని ప్రజలను కోరుతున్నామన్నారు. నియోజకవర్గాన్ని పూర్తి శాంతియుతంగా ఉంచామని అన్నారు. ప్రత్యేకించి తాను వ్యాపారులెవ్వరితో చందాలు తీసుకోలేదని, ఓటు వేస్తే చాలని కోరినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారాన్ని కూడా చాలా ముందుగానే ప్రారంభించామని చెప్పారు. డబ్బులు ఇచ్చి కార్యకర్తలను, నాయకులను రప్పించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు ప్రచారం ప్రారంభమవుతుందని, తనకన్నా 15 నిమిషాలు ముందే స్వచ్ఛందంగా కార్యకర్తలు ప్రచారానికి వస్తున్నారని పేర్కొన్నారు. ఇబ్బందులు పడుతున్నామని తన వద్దకు వచ్చిన వారందరికి తాను ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయం చేస్తున్నానన్నారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాంరెడ్డి, బండి కిశోర్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల వెంకటరమణ, సచివాలయ కన్వీనర్ కంభం వెంకటేష్, చికెన్ బాషా, నీలాపురం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కానపల్లె వాసులు వైఎస్సార్‌సీపీలో చేరిక

మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని కానపల్లె గ్రామానికి చెందిన గుమ్మళ్ల రామకృష్ణారెడ్డి, గుమ్మళ్ల విశ్వనాథరెడ్డి, గుండా శేషారెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు


సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా

ప్రొద్దుటూరు క్రైం : చిన్నారుల నిండు జీవితానికి రెండు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా తెలిపారు. మార్చి 3వ తేదీన పల్స్‌పోలియో కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో సోమవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలోని సభా భవనంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హనీఫ్‌బాబా, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పసికందు నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేయించాలని కోరారు. కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని 4 రూట్‌లలో 46 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో ఒక మొబైల్ టీం కూడా ఉందని తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని 5451 మంది చిన్నారులకు మొదటి రోజు పోలియో కేంద్రాల్లో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. ఏ కారణం చేతనైనా పోలియో చుక్కలు వేయించని చిన్నారులకు ఇంటింటికీ తిరిగి వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, చంద్రకళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య, లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీహెచ్‌ఓలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు శిక్షణ

గోపవరం : బద్వేలులోని ఎన్‌జీవో హోంలో పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి మంగళవారం (ఒక్క రోజు పాటు) శిక్షణ కార్యక్రమం ఉంటుందని మండల వైద్యాధికారి డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10–30 గంటలకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి వైద్య సిబ్బందితోపాటు ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, రూట్ సూపర్‌వైజర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి హరికథా సప్తాహం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి 7 రోజుల పాటు మాఘమాసం పురస్కరించుకుని హరికథా సప్తాహం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో హరికథా సప్తాహంకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 5 గంటలకు యడవల్లి రమణయ్య భాగవతార్, బుధవారం నాయిని లక్ష్మీకుమారి భాగవతారిణి, గురువారం ముప్పవరపు సింహాచల శాస్త్రి భాగవతార్, శుక్రవారం శెట్టి గంగావతి భాగవతారిణి, శనివారం అనసూయ భాగవతారాణి, ఆదివారం వేదవతి భాగవతారిణి, సోమవారం జయంతి సావిత్రి భాగవతారిణిలు హరికథ చెబుతారన్నారు. మార్చి 1న శివదీక్ష బృందం, శివాలయం అర్చకుల ఆధ్వర్యంలో 22వ వార్షికోత్సవ దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి, నవగ్రహ, రుద్రస్వాహాకార హోమాలు, మధ్యాహ్న ప్రసాద వినియోగం, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తలు మల్లికార్జున శెట్టి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశు, సావిత్రమ్మ, ఎక్స్‌అఫిషియో మెంబర్ మహేశ్వరశర్మ పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ


చర్చి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : మండలంలోని మాచనపల్లె గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న చర్చికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. చాపాడు, బి.మఠం, దువ్వూరు మండలాల్లో రూ.కోటితో ప్రభుత్వ నిధులతో చర్చిలను నిర్మిస్తున్నామన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషి ఫలితంగానే నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

మండలంలోని అన్నపుశాస్త్రులపల్లె గ్రామంలో రూ.6.50 లక్షల డీఎంఎస్ నిధులతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో ప్రజలందరూ శుద్ధి చేసిన నీటినే తాగాలన్నారు. వేసవిలో మండలంలో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కానాల ఓబుళరెడ్డి, ఫాదర్ రెవరెండ్ శోభన్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, వీరమోహన్, ఏఎస్‌పల్లె సర్పంచ్ పుత్తా శ్రీనివాసులరెడ్డి, బుక్కాయపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, నాగ సుధారెడ్డి, జేష్టాది రవికుమార్, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓపీఆర్డీ శివప్రసాద్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య సమస్యలు దూరం


మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

మైదుకూరు : గర్భిణులు, పాలిచ్చే తల్లులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు ఉండవని ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కాంతిశ్రీ ఆధ్వర్యంలో గర్భిణులు, తల్లుల పోషకాహారం, లోపాలు- వాటి నివారణ చర్యలు అనే అంశంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, తల్లుల ఆహారపు అలవాట్లు వారి పోషక అవసరాలు తీర్చే విధంగా ఉంటే, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవచ్చని తెలిపారు. ఈ దిశలో పని చేసే అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇటువంటి శిక్షణ ఎంతో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. కేవీకే ఇన్‌చార్జి, శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు కేవీకే ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పోషకాహారం వల్ల గర్భిణులకు కలిగే లబ్ధి, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య లోపాలను ఏవిధంగా నివారించవచ్చనే విషయంపై శాస్త్రవేత్త కాంతిశ్రీ అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ వనిపెంట సెక్టర్ సూపర్‌వైజర్ ఓబుళమ్మ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని పూలంగళ్ల శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రంగనాథస్వామి వారు సతీసమేతుడై గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మండపంలో స్వామికి అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు పర్యవేక్షించారు. బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ పుష్పాలు సమర్పించారు. అనంతరం పట్టణ పురవీధులలో స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో ముగ్ధమోహన రూపుడైన స్వామికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఏకాంత సేవలో శ్రీవెంకటరమణస్వామి

పులివెందుల నడిబొడ్డున వెల వేంకటరమణుడి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీవారు ఏకాంత సేవలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం


ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీకి మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఎగువ రామాపురంలోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేసుకుందామని తెలిపారు. అనంతరం ఎగువ రామాపురం బూత్ అధ్యక్షుడు అంకిరెడ్డి, సురేష్‌యాదవ్, బాలుడుయాదవ్‌లు ఎమ్మెల్సీ గోవిందరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, నారాయణయాదవ్, సుదర్శన్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, సింగరయ్య, కొండా దామోదర్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు, కో కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు సమాజ వికాసం అవసరం


విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న చైర్మన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు విద్యావికాసంతోపాటు సమాజ వికాసం కూడా ఎంతో అవసరం అని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. సోమవారం కడప నగర శివార్లలోని రామరాజుపల్లె నాగార్జున మోడల్ స్కూల్ బ్రాంచ్‌లో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి వార్షికోత్సవాలు కృషి చేస్తాయన్నారు. అనంతరం బచ్‌పన్ ప్లే స్కూల్లో కిండర్‌గార్టెన్ పూర్తి చేసుకున్న చిన్నారులకు చైర్మన్, డైరెక్టర్‌లు కాన్వొకేషన్ పట్టాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వివిధ క్రీడల్లో ప్రతిభ చాటిన చిన్నారులకు కూడా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కృష్ణవేణి, అరుణ, హెచ్‌ఎం వీరశివ పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీ సమస్యలు పరిష్కరించండి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మైదుకూరు : మున్సిపాలిటీలోని 22వ వార్డు పరిధిలో ఉన్న సుందరయ్య కాలనీలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో కాలనీ వాసులు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ మైదుకూరు పట్టణంలో ఏడేళ్ల కిందట 150 కుటుంబాల వారు సుందరయ్య కాలనీ పేరుతో ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నారన్నారు. అయితే కాలనీలో మున్సిపాలిటీ అధికారులు వీధి దీపాలు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యుడు శివకుమార్, జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్, మండల కార్యదర్శి షరీఫ్, సభ్యులు గురవయ్య, బీబీ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 2008, 2018లో ప్రభుత్వం పేదలకు అమృతానగర్‌లో స్థలాలు ఇచ్చిందని తెలిపారు. అక్కడ మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. అమృతానగర్‌లో విద్యుత్, మంచినీరు, రోడ్లు, కాలువలు నిర్మించాలని 32 రోజులుగా ఆందోళన చేస్తున్నామన్నారు. పేదల స్థలాలను కొందరు దొంగ పట్టాలు సృష్టించుకుని అమ్ముకుంటున్నారని అన్నారు. వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, హసీనా, పుష్పలత, మల్లికా భాను, గోవిందమ్మ, శంషాద్, షకీలా, సరస్వతి, హరి, రాములమ్మ, శేఖర్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలి


విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : మహిళా సాధికారత సాధించేలా అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ముందస్తుగా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎందరో మహిళలు చక్కటి విజయాలు సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన ట్రావెల్ మానియా హెచ్‌ఆర్ అనూహ్య మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రాంతాలు, కార్యాలయాల్లో వ్యవహరించే తీరుపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. గురుమోహన్‌రెడ్డి, డా. షాజియాబేగం, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆ వీఆర్‌ఓ రూటే సపరేటు

- కార్యాలయానికి సరిగా రాని వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు వినతి

బ్రహ్మంగారిమఠం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తే.. కొంత మంది అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని ముడుమాల గ్రామ సచివాలయంలో వీఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న జాన్సి కడపలో నివాసం ఉంటున్నారు. ప్రతి రోజు గ్రామ సచివాలయానికి అధికారులు ఉదయం 10 గంటలకు వచ్చి సాయంత్రం 5 వరకు విధులు నిర్వర్తించాలి. వీఆర్‌ఓ జాన్సి అలా కాదు గ్రామ సచివాలయానికి ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో ప్రజలకు అర్థం కావడం లేదు. కనీసం అక్కడ ఉన్న సిబ్బందికి కూడా తెలియడం లేదు. మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠానికి కూడా వచ్చేది లేదు. ముడుమాల పంచాయతీ బస్సులకు అందుబాటులో లేని గ్రామం అయినా.. వీఆర్‌ఓ సమయపాలన పాటించాల్సి ఉంది. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సచివాలయానికి ప్రజలు వచ్చి ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీలో అధికంగా రెవెన్యూ సమస్యలు ఉన్నాయి. వీఆర్‌ఓ అందుబాటులో లేకపోవడంతో.. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వీఆర్‌ఓను మార్చాలని ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం

వీఆర్‌ఓ జాన్సి విధులకు సరిగా రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మా గ్రామ పంచాయతీలో హైవే రోడ్డు పోతోంది, కనీసం ఎవరి పొలాలు ఎన్ని సెంట్లు పోతున్నాయి అనేది చెప్పే దిక్కులేక ప్రతి రోజు బి.మఠం తహసీల్దార్ కార్యాలయానికి ప్రజలు వెళ్తున్నారు. అక్కడి అధికారులు మీ వీఆర్‌ఓ దగ్గర ఫైల్ ఉంది కనుక్కోండి అంటున్నారు. వీఆర్‌ఓ మాత్రం ఎప్పుడు వస్తారో తెలియడం లేదు. ఒక్కో రోజు అసలు రారు. వీఆర్‌ఓను మార్చాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, బద్వేల్ ఆర్డీఓ, గత తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాం. అయినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–శీలం రామగురివిరెడ్డి, ఎంపీటీసీ, ముడుమాల పంచాయతీ

ఫిర్యాదులు వచ్చాయి

ముడుమాల పంచాయతీ వీఆర్‌ఓపై ఫిర్యాదులు వచ్చాయి. ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పాం. తప్పకుండా సమయపాలన పాటించాలి. ముందుగా పంచాయతీ సచివాలయానికి వెళ్లిన తరువాత మండల కేంద్రానికి రావాలి. అక్కడ పనులు ఉంటే ఇక్కడికి అవసరం లేదు. ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తాం. తహసీల్దార్ కూడా కొత్తగా వచ్చారు. ఆయన దృష్టికి తీసుకుపోతాము.

– జాన్స్, డిప్యూటీ తహసీల్దార్, బ్రహ్మంగారిమఠం

అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట


ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్టిస్తున్న దృశ్యం


కొలువుదీరిన అభయాంజనేయస్వామి

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లె గ్రామ సమీపంలో నూతనంగా నిర్మితమైన శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయ ప్రతిష్ట వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. సోమవారం ఆలయంలో అభయాంజనేయస్వామి విగ్రహం, ఆలయ ఎదుట ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారను. వారికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రతిష్ట సందర్భంగా మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్, ఆ పార్టీ నాయకులు హాజరయ్యారు.